సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం ⁞ 28 ⁞ ఫిబ్రవరి ⁞ 2025



ప్రయోగాల పాఠశాల..
దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నూతన ఆవిష్కరణలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. - 8లో▸



నైపుణ్యాలతో విద్యావకాశాలు
నైపుణ్యాలతోనే విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 34°/19°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.



వసంతోత్సవానికి వేళాయె..

నేటి నుంచి నిట్‌లో 'స్ప్రింగ్ స్ప్రీ-25' ● మార్చి 2 వరకు నిర్వహణ

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- హాజరుకానున్న పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు
- ప్రారంభించనున్న హాస్యనటుడు బ్రహ్మానందం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతీ ఏడాది మాదిరిగా విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజులపాటు వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-25) నిర్వహించనున్నారు. నేటి(శుక్రవారం) నుంచి మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించే కల్చరల్ ఫెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. నిట్‌లో ప్రపంచంలోని పలు ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారు. భిన్నత్వంలో ఏకత్వంలా నిలుస్తున్న ఈక్యాంపస్‌లో వివిధ దేశాల సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు 1978లో వసంతోత్సవం ప్రారంభమై.. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా పేరుగాంచింది. దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ వేడుకకు హాజరుకానున్నారు.

తొలిరోజు: శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో హాస్యనటుడు, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత, పద్మశ్రీ బ్రహ్మానందం విద్యార్థులతో చిట్‌చాట్.

రెండో రోజు: శనివారం ప్రోషోలో భాగంగా ఇండియన్ రాక్‌బ్యాండ్ వార్డెక్స్ ఫ్యూజన్ మ్యూజిక్‌తో అలరించనున్నారు. డైరెక్టర్ కట్స్‌లో సినీ డైరెక్టర్లతో చిట్‌చాట్. అల్యూర్‌లో భాగంగా ఫ్యాషన్ షో, నుక్కడ్ నాటక ప్రదర్శన

మూడో రోజు: ముగింపులో భాగంగా ఆదివారం పాపులర్ సింగర్ అమిత్ త్రివేది హిందీ, ఇంగ్లిష్ సంగీత విభావరి. నిపుణులతో బైక్‌స్టంట్స్.

ఈసారి థీం లేదు: స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను ప్రతీ ఏడాది ప్రత్యేక థీంతో నిర్వహించేవారు. 2022లో సృష్టిగా, 2023లో కళాధ్వనిగా, 2024లో రాసంగేన్ థీం (ఇతి వృత్తం) తో నిర్వహించారు. ఈసారి అదేపేరుతో స్ప్రింగ్ స్ప్రీ-25ను నిర్వహించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.



యువతలోని ప్రతిభ వెలికితీసేందుకు

యువతలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు వేదికగా స్ప్రింగ్ స్ప్రీ-25 నిలువనుంది. సంగీతం, నృత్యం, కళలు, వినోదం పలు రంగాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపేందుకు సినీనటుడు బ్రహ్మానందం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు.

- డి.శ్రీనివాసాచార్య, నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్



కలర్‌ఫుల్‌గా కల్చరల్ ఫెస్ట్

నాటి ఆర్ఈసీ 1978లో ప్రారంభమైన స్ప్రింగ్‌స్ప్రీ నేడు దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద కల్చరల్‌ఫెస్ట్‌గా పేరుగాంచింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల సంస్కృతీసంప్రదాయాలను పంచుకునే వేదికగా ఏర్పాటు చేసిందే ఈ వేడుక. నిట్‌లో 41 వసంతోత్సవ వేడుకలను స్ప్రింగ్‌స్ప్రీ-25గా జరుపుకుంటున్నాం. మూడు రోజుల పాటు కల్చరల్‌ఫెస్ట్‌ను కలర్‌ఫుల్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

- బిద్యాధర్ సుబుదీ, నిట్ డైరెక్టర్

న్యూస్‌రీల్

ఘనంగా రుద్రేశ్వరుడి నాగవెల్లి



హన్మకొండ కల్చరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరస్వామి రుద్రేశ్వరీ అమ్మవారికి బుధవారం రాత్రి కల్యాణం నిర్వహించారు. మూడో రోజు గురువారం నాగవెల్లి నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకుడు సందీప్, ప్రణవ్ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నూతనవస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు అన్నపూజ..
శుక్రవారం ఉదయం రుద్రేశ్వరస్వామికి 51 కిలోల పెరుగన్నంతో అన్నపూజ, అనంతరం భక్తులకు మహాన్నదానం జరుగుతుందని ఆలయ ఈఓ అనిల్‌కుమార్ తెలిపారు.

తెలుగు బీఓఎస్ చైర్మన్‌గా శంకరయ్య



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంథిని శంకరయ్య నియమితులయ్యారు. ఈమేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో తెలుగు విభాగం బీఓఎస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి మృతి చెందడంతో వేకెన్సీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఆస్థానంలో శంకరయ్యను నియమించారు. ఉత్తర్వులను వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా శంకరయ్య అందుకున్నారు.

నాటక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సహృదయ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన తెలుగు భాష ఆహ్వాన నాటక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం రాత్రి 11 గంటలకు సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో నాటక పోటీల విజేతలకు అందించారు. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'చిగురు మేఘం' నాటకానికి మొదటి, కొలకలూరుకు చెందిన శ్రీసాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటకానికి ద్వితీయ బహుమతి అందించారు. ఉత్తమ నటుడు, నటి, క్యారెక్టర్ నటుడు, హాస్యనటుడు, రచన, దర్శకుడు, సంగీతం, రంగాలంకరణ తదితర విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సహృదయ సభ్యులు మల్యాల మనోహర్, కుందావఝ్ఝల కృష్ణమూర్తి, వనం లక్ష్మీకాంతారావు, ఎన్వీఎన్ చారి, జూలూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గీత దాటుతున్న పోలీస్!



ఆ అధికారులపై చర్యలు ఉండేనా?

- స్టేషన్లలో పంచాయితీలకే ప్రాధాన్యం
- డీజీపీకి ఫిర్యాదుల వెల్లువ
- వివాదంగా మారుతున్న కమిషనరేట్ పరిధి కొందరు అధికారులు తీరు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది పోలీస్ అధికారులపై వస్తున్న ఆరోపణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా చేస్తున్న పనులు వివాదాస్పదమవుతున్నాయి. బాధితులకు అండగా ఉండాల్సిన వీరు అక్రమార్కులకు దన్నుగా నిలుస్తున్న సందర్భాలు వెలుగు చూస్తున్నాయి. భూ పంచాయితీల్లో జోక్యంపై ఉన్నతాధికారులు హెచ్చరించినా కొందరిలో మార్పు రావడం లేదు. దీంతో ఏకంగా బాధితులు నేరుగా రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కలిసి గోడు వెల్లబోసుకుంటున్నారు. తాజాగా మామునూరు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఒంటేరు రమేశ్‌పై డీజీపీకి ఫిర్యాదు అందింది. కొన్ని రోజుల క్రితం ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ సంతోశ్ తనను పోలీస్‌స్టేషన్‌కు రావొద్దని ఇష్టారీతిన దూషించినట్లు పేర్కొంటూ ఓ బాధితుడు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఓ సీనియర్ ఇన్‌స్పెక్టర్ భూ కబ్జాకు పాల్పడి, తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మరో బాధితుడు సీఎం నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిఘా విభాగం అధికారులతో విచారణ చేయిస్తున్నారు.

కొందరు అధికారులకు స్వర్ణయుగం
వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు మిస్టర్ కూల్‌గా పేరుంది. దీన్ని ఆసరాగా.. అవకాశంగా తీసుకుంటున్న కొంతమంది పోలీస్ అధికారులు భూ పంచాయితీలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా సకాలంలో చర్యలు ఉండకపోవడం, వారిని కట్టడి చేయకపోవడం వల్ల చివరికి ఫిర్యాదులు డీజీపీ వరకు వెళ్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పోస్టింగ్‌ను అడ్డుపెట్టుకొని అడ్డుగోలుగా సంపాదిస్తున్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కమిషనరేట్‌లో కొంతమందికి ప్రస్తుతం స్వర్ణయుగం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సరిహద్దు వివాదం.. కమిషనరేట్‌కు మచ్చ?
ఈనెల 20న రాత్రి అమ్మవారిపేట, భట్టుపల్లి మధ్య యువవైద్యుడిపై జరిగిన హత్యాయత్నం ఘటనలో మిల్స్‌కాలనీ, మడికొండ పోలీస్ స్టేషన్ల అధికారులు, కాజీపేట, వరంగల్ ఏసీపీలు సరిహద్దు విషయంలో పడిన గొడవ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు మాయని మచ్చగా మారినట్లు ప్రచారం సాగుతోంది. బాధితుడు రక్తపుమడుగులో ఉండగానే ఈ పరిధి తమది కాదంటే తమది కాదని అధికారులు వాగ్వాదానికి దిగడంతోపాటు ఎవరూ సరైన సమయంలో స్పందించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరికి ఓ బెల్ట్‌షాప్ యజమానిని నువ్వు ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం కొనుగోలు చేస్తావని పోలీసులు తెలుసుకొని సరిహద్దు సమస్యను పరిష్కరించుకోవడం ఆ అధికారుల పనితీరుకు అద్దం పడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు ఎందుకు ఉండట్లేదు?
వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న కొంత మంది అధికారులు నిబంధనల గీతను దాటుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు రావడం సహజమైనప్పటికీ విచారణలో నిజం తెలిసినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ అధికారులు కాస్త ముదురు...

- పరకాల సబ్ డివిజన్ పరిధిలో భూ పంచాయితీలకు వేదికైన ఓ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వాటికే ప్రాధాన్యం ఇచ్చినా.. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని సమాచారం.
- అదే సబ్ డివిజన్ పరిధిలో ఓ ఇన్‌స్పెక్టర్ తన మద్యం మామూళ్లను పెంచుకుని దుకాణాల యజమానులకు ఫోన్లు చేసి హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. సదరు అధికారి తీరుపై ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు ఇటీవల విధుల్లో చేరిన కొత్త కానిస్టేబుళ్లను నోటికి వచ్చినట్లు తిడుతున్నట్లు సమాచారం.
- మామునూరు సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఓ అధికారి మామూళ్లను పెంచడం, ఇన్‌స్పెక్టర్‌కు పంచడం, పంచాయితీల్లో దండుకొని వాటాలు పంచడంలో ఘనాపాటిగా పేరుంది. ఇన్‌స్పెక్టర్ సైతం భూపంచాయితీల్లో మునిగిపోగా, సదరు సబ్ ఇన్‌స్పెక్టర్ అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌కు భూ పంచాయితీల్లో పెట్టింది పేరు. నిత్యం వందలాది ఫిర్యాదులు. ఏ ఫిర్యాదును ముట్టుకున్నా భూ వివాదమే. దీంతో ఓ అడుగు ముందుకేసి సదరు ఇన్‌స్పెక్టర్ వాటి పంచాయితీలకు మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే లా అండ్ ఆర్డర్ అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- హనుమకొండ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో సదరు ఇన్‌స్పెక్టర్ నిబంధనలు ఎలా ఉన్నా భూ పంచాయితీల్లో తనకు నచ్చని వర్గంపై కేసు నమోదు చేయడం, మరో వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడం అలవాటుగా మార్చుకున్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి నివేదికలు

కొంతమంది పోలీస్ అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నప్పటికి వారు చేస్తున్న దందాలపై నిఘా వర్గాల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు అందుతున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోకపోవడంపై కొంతమంది ఆ శాఖ అధికారులే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కొంత మంది ఎమ్మెల్యేలు సైతం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రాష్ట్ర ఉన్నతాధికారుల సూచనల మేరకు భూ పంచాయితీల్లో తలదూరుస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటారా..లేదా అన్నది వేచి చూడాల్సిందే.

సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవాలి

- అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనంలో కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ: రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలతో పాటు రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ-కేరళ అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పి.ప్రావీణ్య జ్యోతి వెలిగించి సమ్మేళనం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల వారు ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. కేరళ యువత.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను, ఇక్కడి యువత కేరళ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవాలని సూచించారు. తాను కూడా కేరళ రాష్ట్రాన్ని పలుమార్లు సందర్శించానని కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన కేరళ యువతకు డ్రెస్, టోపీలతో కూడిన కిట్లను ఆమె అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



టెలికాం కాలనీ పార్కును తనిఖీ చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పార్కుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారుల్ని ఆదేశించారు. గురువారం వరంగల్ నగర పరిధి టెలికాం కాలనీ, ఎల్బీనగర్ పార్క్, క్రిస్టియన్ కాలనీలో బల్దియా నిర్వహిస్తున్న నర్సరీని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలిచ్చారు. పార్కులో వర్షాకాలం నీరు నిలుస్తోందని ఎల్బీనగర్ స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా.. సమస్యను పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 20వ డివిజన్‌లో తిలక్‌రోడ్డు విస్తరణ పనుల్ని ఆమె పరిశీలించారు. ఈతనిఖీల్లో అధికారులు లక్ష్మారెడ్డి, ఈఈ శ్రీనివాస్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సీ, అనూహ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో పురోగతి అవసరం..
ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో పురోగతి అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బల్దియా పరిధి 21వ డివిజన్ ఎల్బీనగర్‌లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, రెవెన్యూ అధికారి షహజాదీ బేగం, ఆర్ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లు



ప్రశాంతంగా 'ఎమ్మెల్సీ' పోలింగ్

- హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఉత్సాహంగా ఓటేసిన ఉపాధ్యాయులు
- నల్లగొండలోని స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు
- పలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారులు, సీపీ



హసన్‌పర్తి పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి:

ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ కొనసాగింది. టీచర్లు, అధ్యాపకులు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,189 మంది ఓటర్లు ఉండగా 10,401 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తంగా 92.95శాతం పోలింగ్ నమోదైంది. హనుమకొండ జిల్లాలోని 15 పోలింగ్ కేంద్రాల్లో కలిపి 5,215 మంది ఓటర్లు ఉండగా.. 4,780 మంది (91.66శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నల్లగొండ జిల్లా కేంద్రంలో మార్చి 3న జరగనుంది. హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీ, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పోలింగ్ సరళిని పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాల పోలింగ్ కేంద్రంలో అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు.



లా కళాశాల సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

కేడీసీలో నాలుగు పోలింగ్ కేంద్రాలు
హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అశోక్ సెంటర్ నుంచి బస్టాండ్ రోడ్డులో ఈ కళాశాల ఉంది. కళాశాల సమీపంలో రహదారికి ఇరువైపులా కొంత దూరం వరకు అభ్యర్థుల మద్దతుదారులు టెంట్లు వేసుకొని పోలింగ్ చిట్టీలు రాసిచ్చారు. ఈ మార్గం సాధారణంగానే నిత్యం రద్దీగా ఉంటుంది. అభ్యర్థుల మద్దతుదారులు, ఓటర్లతో మరింత రద్దీగా కనిపించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వివిధ పోలింగ్ కేంద్రాలను టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, పూల రవీందర్, పులి సరోత్తంరెడ్డి, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, సుందర్‌రాజు యాదవ్, యోల చంద్రమోహన్ వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

పట్టభద్రుల్లో కొరవడిన చైతన్యం
పట్టభద్రుల్లో చైతన్యం కొరవడడంతో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. హనుమకొండ జిల్లాలోని నాలుగు మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 4,585 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. 1,780 మంది ఓటర్లు (38.82శాతం) ఓటు వేశారు.

పరిశీలించిన సీపీ
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను సీపీ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

వరంగల్ జిల్లాలో..
సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో 2,352 మంది ఓటర్లకు గానూ 2,214 మంది (94.13 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద.. సెంట్రల్ డీసీపీ షేక్ సలీమాతో కలిసి వరంగల్ పట్టణంలోని ఇస్లామియా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

పోలింగ్ సరళిపై మరిన్ని ఫొటోలు : 9లో..



శాయంపేటలో పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేస్తున్న సిబ్బంది

ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ వివరాలు..

జిల్లా	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
జనగామ	1,002	945	94.31
హనుమకొండ	5,215	4,780	91.66
వరంగల్	2,352	2,214	94.13
మహబూబాబాద్	1,663	1,571	94.47
జేఎస్ భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83



వరంగల్ రంగశాయిపేట కళాశాలలో ఓటేసేందుకు బారులుదీరిన ఉపాధ్యాయులు

నైపుణ్యాలతో విద్యావకాశాలు

● కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : నైపుణ్యాలతోనే విద్యార్థులకు విద్యావకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ సెనేట్ హాల్‌లో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ అధ్యక్షతన 'ఎక్స్‌ప్లోరింగ్ ఎడ్యుకేషనల్ ఆపర్చునిటీస్ ఇన్ ది యూఎస్ ' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అంకితభావం, పట్టుదల, మార్పుకు సిద్ధంగా ఉండడం లాంటి అంశాలతో లక్ష్యం సాధించొచ్చన్నారు. వర్సిటీలో అకడమిక్‌తో పాటు పూర్తి స్థాయి నైపుణ్యాల పెంపు దిశగా పనిచేస్తున్నామని వివరించారు. అనంతరం హైదరాబాద్‌లోని యూఎస్ కన్సలేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ అమెరికాలో విద్యార్థులకు అద్భుత విద్యావకాశాలు ఉన్నాయన్నారు. టీచింగ్‌లో నూతన టెక్నాలజీ వినియోగం పెరిగిందన్నారు. అమెరికాలో ఉన్నత విద్యతో విద్యార్థి జీవితం మారుతుందన్నారు. టెక్నాలజీ సాయంతో స్కిల్, టాలెంట్ పెంచుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ వి.రామచంద్రం, ఓఎస్డీ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు రాము, చిర్ర రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణ, భిక్షాలు, బయో టెక్నాలజీ విభాగాధిపతి శాస్త్రీ, తదిరులు పాల్గొన్నారు.

'అకుట్' జనరల్ సెక్రటరీ పదవికి ఇద్దరు పోటీ

● ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం ముగిసింది. అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి పోటీ పడుతున్నారు. జనరల్‌సెక్రటరీ పదవికి బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ బరిలో నిలిచారు. పరిపాలనాభవనంలోని సెనేట్‌హాల్‌లో మార్చి 4న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. 5న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. కేయూ పరిధిలో 77 మంది అధ్యాపకులు ఓటర్లుగా ఉన్నారు.

ప్రయోగాల పాఠశాల..

నూతన ఆవిష్కరణలతో ముందుకెళ్తున్న నాచినపల్లి ప్రభుత్వ పాఠశాల

నేడు సైన్స్ దినోత్సవం



విలేజ్ ఇన్నోవేటర్ అవార్డు అందుకుంటున్న విద్యార్థి దినేశ్

● విద్యార్థుల ఎగ్జిబిట్లతో కార్పొరేట్‌కు దీటుగా దేశవ్యాప్త గుర్తింపు పొందుతున్న స్కూల్

● సైన్స్ ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, సుమలత ప్రోత్సాహంతో విద్యార్థుల ఆవిష్కరణలు

దుగ్గొండి: సైన్స్.. పుస్తకంలోని పాఠం కాదు. సమాజంలోని మూఢ నమ్మకాలను దూరం చేసే శాస్త్రం. విద్యార్థుల్లోని ఆలోచన శక్తిని పెంచడంతోపాటు నూతన ఆవిష్కరణల వైపు వారి దృష్టిని మరల్చడం.. ప్రశ్నించే తత్వం అలవర్చడ సైన్స్ లక్ష్యం. సరిగా ఇదే లక్ష్యంతో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందుకెళ్తోతుంది. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తూ కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, వెలిదండి సుమలత ప్రోత్సాహంతో విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ఇంటింటా ఇన్నోవేటర్ పోటీల్లో ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్ జిల్లా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుని విలేజ్ ఇన్నోవేటర్ అవార్డును సొంతం చేసుకుంది. ఇదే పాఠశాల నుంచి ఏటీబీ.. ఏనీటైం బ్యాగ్ మిషన్ కేంద్ర మంత్రిత్వశాఖ నిర్వహించే స్టూడెంట్ ఇన్నోవేషన్ మారథాన్‌లో జాతీయస్థాయి గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో నేడు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం

ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్..

వ్యవసాయంలో రోజురోజుకూ కూలీల ఖర్చు పెరగడంతో పాటు కొరత ఏర్పడుతోంది. దీంతో సమస్యను అధిగమించడానికి పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దినేశ్ తన పరిజ్ఞానంతో ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్‌ను తయారు చేశాడు. మొదట ఓ స్టాండ్ తయారు చేసి స్టాండ్‌కు గిన్నెలు అమర్చిన బెల్టును విద్యుత్ మోటారుకు అనుసంధానించాడు. మోటారు ఆన్‌చేయగానే బెల్టు తిరగడంతో ధాన్యం బస్తాలలో నిండుతుంది. ఒక వ్యక్తి మాత్రమే అవసరమవుతారు..



ఈజీప్యాడీ ఫిల్లింగ్ మిషన్‌ను చూపుతున్న విద్యార్థి దినేశ్

ఏటీబీ(ఎనీటైం బ్యాగ్)



ఏటీబీ మిషన్ చూపుతున్న విద్యార్థి రిషిక్

ప్లాస్టిక్ వాడకం విరివిగా పెరిగి భూమి కలుషితం కావడంతో పాటు ప్లాస్టిక్ సంచులలో తీసుకునే ఆహార పదార్థాలతో రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ తరుణంలో గుడ్డ సంచులను ఏటీబీ మిషన్‌ద్వారా తీసుకునే పరికరం రూపొందించాడు 10వ తరగతి విద్యార్థి రిషిక్. రూ.5 నాణెం మిషన్‌లో వేస్తే గుడ్డ సంచి వచ్చేలా తయారు చేశాడు. మిషన్‌లో 500 బ్యాగులు ఉంచేలా నిర్మించాడు. దీంతో పాటు మిషన్ లోపల ప్లాస్టిక్‌తో నష్టాలు, గుడ్డ సంచుల వల్ల లాభాలు, పర్యావరణ హితం కోరే విధంగా వివరించేలా స్పీకర్లు ఏర్పాటు చేశాడు. దీనిని బస్టాండ్ సెంటర్లు, కూరగాయాల మార్కెట్లు, రద్దీ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని వివరించాడు. ఒక్కో మిషన్‌కు రూ. 25 వేల ఖర్చు అవుతుంది. పరికరం తయారీకి కేంద్ర మంత్రిత్వశాఖ నిధులు మంజూరు చేయడానికి అంగీకరించింది.

కల్పనాచావ్లా సైన్స్ క్లబ్..

పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు సుమలత విద్యార్థులతో కల్పనాచావ్లా పేరిట సైన్స్ క్లబ్‌ను ప్రారంభింపజేసి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి నూతన ఆలోచనలు స్వీకరిస్తూ వాటి ద్వారా నూతన ఆవిష్కరణలకు రూపం ఇస్తున్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మూఢనమ్మకాలు, కరోనా కల్లోలం వంటి సైన్స్ నాటికలు ప్రదర్శించి జాతీయస్థాయిలో బహుమతులు అందుకున్నారు. ఇదే విధంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో విద్యార్థులు ప్రతీ నెలా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం కలిగిన విద్యార్థులను తయారు చేయడంలో పాఠశాల ముందు వరుసలో నిలుస్తోంది.

సైన్స్ టాలెంట్ టెస్టులో విష్ణువర్ధన్‌కు ద్వితీయ స్థానం

మహబూబాబాద్ అర్బన్ : సైన్స్ టాలెంట్ టెస్టులో మహబూబాబాద్ మండలం మాధావపురం జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి నక్క విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. 'నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు' అనే అంశంపై ఈ 18వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇందులో ధ్వని అనే పాఠంతో నాటి రేడియో నుంచి.. నేటి సెల్‌ఫోన్ వరకు పని చేస్తున్నాని, విద్యుత్ పాఠంతో చీకటిగా ఉన్న భూగోళాన్ని వెలుతురుగా మార్చి ప్రతి ఇంటిలో వెలుగులు నిండాయని, న్యూటన్ గమన నియమాల ద్వారా రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపగలుగుతామని, బేర్నొలి సూత్రం ద్వారా రైట్ సోదరులు విమానాన్ని కనుగొన్నారని, ఆక్సిజన్ కనుగొనడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను బతికించగలుగుతామనే, తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. దీంతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో ఎస్‌సీఈఆర్ డైరెక్టర్ రమేశ్ చేతుల మీదుగా విష్ణువర్ధన్ బహుమతి అందుకున్నాడు.



సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకుంటున్న విష్ణువర్ధన్

కాగా, భౌతికశాస్త్రం ప్రణాళిక ప్రకారం చదివితే సులువుగా నేర్చుకొవచ్చని ఉపాధ్యాయులు తెలిపారని విష్ణువర్ధన్ చెప్పాడు. పాఠాలు విన్న తర్వాత ఇంటికెళ్లి చదువుతానన్నాడు. దీంతో భౌతికశాస్త్రం సులువుగా అర్థమవుతోందన్నాడు.

కుమారుడి కళ్లెదుటే కనిపించని లోకాలకు..

బైక్‌ను ఢీకొన్న లారీ.. తల్లిదండ్రులు దుర్మరణం

● గుండెలవిసేలా రోదించిన కుటుంబికులు..

● మల్లంపల్లిలో ఘటన



మహమూద్(ఫైల్)



షేక్ సైనా(ఫైల్)

ములుగు : కుమారుడి కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం చెందారు. బైక్‌పై తల్లిదండ్రులు ముందు వెళ్తున్నారు. కుమారుడు వారికి కొద్ది దూరంలో వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ దృశ్యాన్ని చూసిన కుమారుడు గుండెలవిసేలా రోదించాడు. ఇక తనకు దిక్కెవరంటూ తల్లిదండ్రుల మృతదేహాలపై పడి బోరున విలపించాడు. ఈ ఘటన గురువారం ములుగు జిల్లా మల్లంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన దంపతులు షేక్ మహమూద్(58), షేక్ సైనా(45)తమ కుమారుడు షబ్బీర్‌తో కలిసి రెండు బైక్‌లపై పని నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి శివరాత్రి సందర్భంగా రామప్ప వెళ్లారు. అనంతరం స్వగ్రామం బుధరావుపేటకు వస్తున్నారు. మల్లంపల్లి నుంచి వెళ్తున్న క్రమంలో మల్లంపల్లి- నర్సంపేట జాతీయ రహదారిపై నర్సంపేట వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మహమూద్, షేక్ సైనా అక్కడికక్కడే దుర్మరణం చెందారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బావమరిది గపూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరావు తెలిపారు. కాగా, తన కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం చెందడంతో కుమారుడు షబ్బీర్ కన్నీరుమున్నీరుగా రోదించాడు.

గంటలో ఇంటికి చేరేవారు..

ఖానాపురం: రెక్కాడితే కానీ డొక్క నిండని కుటుంబం. ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేసుకునే ఆ కుటుంబంలో పెనువిషాదం చోటుచేసుకుంది. మరో గంటలో ఇంటికి చేరుకోవాల్సిన తరుణంలో మృత్యువు కబలించింది. వ్యాపారం పూర్తయిన అనంతరం ఇంటిబాట పట్టిన దంపతులు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబం బోరున విలపించింది.. ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన షేక్ మహమూద్, షేక్ సైనా దంపతులు రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవనోపాధి నిమిత్తం నెల రోజుల క్రితం ఆసిఫాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి శివరాత్రి సందర్భంగా రామప్ప వెళ్లారు. వ్యాపారం ముగిసిన అనంతరం బైక్‌పై మల్లంపల్లికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా మల్లంపల్లి మండల శివారులోని నర్సంపేట జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మహమూద్ లారీ చక్రాల కింద నలిగిపోగా రోడ్డు పక్కన సైనా విగత జీవిలా పడింది. ఈ దంపతులకు నలుగురు సంతానం. కుమారుడు, కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తె, కుమారుడికి కావాల్సి ఉంది. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో రోదిస్తున్న తీరు పలువురిచేత కన్నీరు పెట్టించింది.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి దుర్మరణం



ప్రసాద్(ఫైల్)

మంగపేట: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో మంగపేట మండల కేంద్రానికి చెందిన కిరాణా వ్యాపారి బొల్లా ప్రసాద్ (44) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురువారం తెల్ల వారు జామున తాడ్వాయి మండల పరిధిలో జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్రసాద్ తన మిత్రులతో కలిసి జిల్లాలోని వెంకటాపురం(ఎం) మండలం పాలంపేటలోని రామప్ప ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు బుధవారం రాత్రి కారులో వెళ్లారు. దైవదర్శనం అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో తాడ్వాయి మండల పరిధిలోని జలగలంచ తోగు గుంపుల మధ్య అడవి జంతువు అడ్డుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారులో అతడి తోపాటు ఉన్న మంగపేటకు చెందిన బట్టలషాపు యజమాని శిద్ధశెట్టి శ్రీనివాస్, టీజీ ఎన్పీడీసీఎల్ మంగపేట ఏఈ రామసుబ్బరాయశర్మ, గుర్రం వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ప్రసాద్ మృతదేహంతోపాటు క్షతగాత్రులను 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు బొల్లా సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట రైతుకు దేశవ్యాప్త గుర్తింపు

● బోడ వీరన్నకు జాతీయ స్థాయి అవార్డు ..

● అందజేసిన కేంద్ర మంత్రి సుశ్రీశోభా కరండ్లజే



కేంద్ర మంత్రి సుశ్రీశోభా కరండ్లజే నుంచి అవార్డు స్వీకరిస్తున్న రైతు వీరన్న (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

మహబూబాబాద్ రూరల్ : మానుకోట రైతుకు దేశవ్యాప్త గుర్తింపు లభించింది. మహబూబాబాద్ మండలం చోక్ల తండా జీపీ పరిధి మేగ్యా తండాకు చెందిన బోడ వీరన్న జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. బెంగుళూరులోని ఐసీఏఆర్ ప్రధాన కేంద్రంలో గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్, లేబర్, ఎంప్లాయిమెంట్ శాఖల మంత్రి సుశ్రీశోభా కరండ్లజే చేతుల మీదుగా వీరన్న అవార్డు స్వీకరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పట్టుదలతో సాగు చేసిన రైతు బోడ వీరన్న.. మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్ ద్వారా సూచనల ద్వారా అద్భుత ఫలితాలు సాధించాడు. షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా బెంగుళూరు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన అర్క తేజస్వి మిరప రకాన్ని 2024 ఖరీఫ్‌లో పండించి ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. దేశ వ్యాప్తంగా భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ఎంపిక చేసిన 14 మంది ఉత్తమ ఉద్యాన రైతుల్లో బోడ వీరన్న ఒకరు. కాగా, వీరన్న పలువురు మిరప రైతులకు ఆదర్శంగా నిలిచాడని జిల్లా వాసులు పేర్కొన్నారు.

కేయూను సందర్శించిన కేరళ యువత



వీసీ, రిజిస్ట్రార్లతో కేరళ యువత

కేయూ క్యాంపస్: అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనానికి వచ్చిన కేరళ యువతీ యువకులు గురువారం కాకతీయ యూనివర్సిటీని సందర్శించిచారు. వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో మాట్లాడారు. కేయూలోని కోర్సులు, వసతులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య ఎల్‌పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఎ.మధు తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే..

భర్తపై హత్యాయత్నం

● వీడిన డాక్టర్ సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు మిస్టరీ..

● నిందితులు భార్య ఫ్లోరా, ప్రియుడు శామ్యూల్, సహకరించిన ఏఆర్‌కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అరెస్ట్

● వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్



నిందితుల అరెస్ట్ చూపుతూ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

ఖిలా వరంగల్: వరంగల్ భట్టుపల్లి రహదారిపై ఎస్ఆర్ స్కూల్ సమీపాన ఈనెల 20న డాక్టర్ గాదె సుమంత్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో మిస్టరీ వీడింది. డాక్టర్ భార్యే ప్రధాన సూత్రదారి అని తేల్చారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను ప్రియుడితో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ సహకారంతో హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు గాదె ఫ్లోరా, ప్రియుడు సంగారెడ్డికి చెందిన ఎర్రోళ్ల శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ మంచుకూరి రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నందిరామ్‌నాయక్.. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై సురేశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

హత్యకు రూ. లక్ష అడ్వాన్స్..

తన భర్త సుమంత్‌రెడ్డిని పక్కాగా హతమార్చేందుకు 15 రోజుల క్రితం ఫ్లోరా తన ప్రియుడు శామ్యూల్‌కి రూ.లక్ష అడ్వాన్స్ అందజేసింది. శామ్యూల్ రూ.50వేలు తన దగ్గర ఉంచుకుని, రూ.50వేలు ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు ఇచ్చాడు. అడ్వాన్స్ ముట్టడంతో ఏఆర్ కానిస్టేబుల్ విధులకు మూడు రోజులు సెలవు పెట్టాడు. ఈనెల 20వ తేదీన సంగారెడ్డిలో సుత్తి కొనుగోలు చేసి రాజ్‌కుమార్‌కు చెందిన బైక్‌పై ఇద్దరు నేరుగా కాజీపేట చేరుకున్నారు. సీసీ కెమెరాలు, జన సంచారం లేని చీకటి ప్రదేశాన్ని హత్యకు స్పాట్‌గా ఎంచుకున్నారు. రాత్రి 10.30కి సుమంత్‌రెడ్డి క్లినిక్ బంద్ చేసి తన కారులో కడిపికొండ బ్రిడ్జి మీదుగా భట్టుపల్లి నుంచి వరంగల్‌లోని ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో సుమంత్‌రెడ్డి ప్రయాణించే కారు వెంబడిస్తూ శ్యామ్యూల్, రాజ్‌కుమార్ బైక్‌పై బయలుదేరారు. భట్టుపల్లి దాటిన తర్వాత ఎస్ఆర్ స్కూల్ సమీపాన చిన్న బ్రిడ్జి వద్దకు రాగానే శామ్యూల్ సుత్తితో కారుఇండికేటర్‌పై కొట్టాడు. దీంతో భారీ శబ్ద రావడంతో సుమంత్‌రెడ్డి కారు రోడ్డు పక్కన నిలిపి వెనక వైపు వెళ్లి పరిశీలిస్తుండగా.. శామ్యూల్, రాజ్‌కుమార్ కలిసి సుమంత్‌రెడ్డి తల, మెడపై విచక్షణారహితంగా సుత్తితో కొట్టారు. దీంతో తీవ్రరక్తస్రావంతో సుమంత్‌రెడ్డి పడిపోగా చనిపోయాడనుకొని భావించిన నిందితులిద్దరు ఘటనా స్థలి నుంచి బైక్‌పై సంగారెడ్డికి పరారయ్యారు.

తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు..

సుమంత్ రెడ్డి హత్యాయత్నంపై తండ్రి ఆరోగ్య సుధాకర్ రెడ్డి వరంగల్ మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, మిల్స్ కాలనీ ఎస్సై సురేశ్, కానిస్టేబుల్ బావుసింగ్, చంద్రశేఖర్, వెంకన్న, రాజు, జలేందర్, ఎండీ గౌస్, ఎఎఓ సల్మాన్ ఐటీకోర్ కానిస్టేబుల్ నగేశ్ నాలుగు బృందాలుగా ఏర్పడి సీసీ ఫుటేజీతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గురువారం నిందితులను సంగారెడ్డిలోని ఆదర్శకాలనీ కొండాపూర్‌లో ఏర్రోళ్ల శామ్యూల్, గాదె ఫ్లోరా, ఏఆర్ కానిస్టేబుల్ మంచుకూరి రాజ్‌కుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌తో ఒప్పందం..

వరంగల్ చేరిన అనంతరం కూడా ఫ్లోరా.. శామ్యూల్‌తో ఫోన్‌లో మాట్లాడేది. భర్త లేని సమయంలో శామ్యూల్‌ను ఇంటికి పిలిపించుకునేది. ఈ విషయం తెలుసుకున్న సుమంత్ రెడ్డి భార్యను మందలించేవారు. దీనికి తనకు విడాకులు ఇవ్వాలని ఫ్లోరా డిమాండ్ చేసింది. ఇందుకు సుమంత్ రెడ్డి నిరాకరించడంతో ఈ విషయంపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో ఫ్లోరా, ప్రియుడి శామ్యూల్.. సుమంత్‌రెడ్డిని ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకున్నారు. శామ్యూల్ ఈ విషయాన్ని తన స్నేహితుడు ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు వివరించాడు. సుమంత్‌రెడ్డి హత్యకు సహకరిస్తే సంగారెడ్డిలో భవనం నిర్మించి ఇస్తానని ఫ్లోరా చెప్పగా..రాజ్‌కుమార్ ఒప్పుకున్నాడు.

వివాహేతర సంబంధమే కారణం..

వరంగల్‌కు చెందిన గాదె ఆరోగ్య సుధాకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సుమంత్‌రెడ్డి, వరంగల్‌లోని షిర్డీ సాయినగర్‌కు చెందిన ఫ్లోరా 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తమ బంధువులకు చెందిన విద్యా సంస్థలను చూసుకునేందుకు భార్య ఫ్లోరాతో కలిసి సుమంత్‌రెడ్డి 2018లో వరంగల్ నుంచి సంగారెడ్డికి వెళ్లారు. అక్కడ సుమంత్‌రెడ్డి స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, తన భార్య ఫ్లోరా బంధువుల విద్యా సంస్థల్లో పర్యవేక్షణతోపాటు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. బరువు తగ్గడానికి సంగారెడ్డిలోని సిద్దు జిమ్‌సెంటర్‌కి వెళ్తుండేది. ఈ క్రమంలో సంగారెడ్డిలోని ఆదర్శకాలనీ కొండాపూర్‌కు చెందిన జిమ్ సెంటర్ కోచ్ ఏర్రోళ్ల శామ్యూల్ పరిచయమయ్యాడు. ఆ పరిచయం ఇద్దరి మధ్య ప్రేమ వివాహేతర సంబంధానికి దారితీసింది.ఈ విషయం సుమంత్‌రెడ్డికి తెలియడంతో గొడవ జరిగింది. సంగారెడ్డి నుంచి షిఫ్ట్ అయితే గొడవలు తగ్గుతాయని భావించిన సుమంత్‌రెడ్డి వరంగల్‌కు చేరారు. 2019లో ఫ్లోరా జనగామ జిల్లా పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తుండేది. ఆ కాలేజీ గతేడాది వరంగల్ రంగశాయిపేటకు మారడంతో విధులు ఇక్కడే నిర్వహిస్తుండగా.. సుమంత్‌రెడ్డి వరంగల్ హంటర్ రోడ్డు గ్రీన్‌వుడ్‌స్కూల్ సమీపాన వాసవికాలనీలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. సుమంత్‌రెడ్డి ప్రస్తుతం కాజీపేటలో ప్రైవేట్ ఆస్పత్రి నడుపుకుంటున్నాడు.

బాలికల గురుకులంలో కమిషనర్ రాత్రిబస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే గురువారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, కళాశాల రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, బోధన సిబ్బందితో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండగా విద్యార్థులతో మాట్లాడి భోజనం, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. పాఠశాలలోనే నిద్రించారు. కమిషనర్ వెంట ఉప కమిషనర్ ప్రసన్నరాణి, వైస్ ప్రిన్సిపల్ మాలిక తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవ్వాలి

● జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న



మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈదురు వెంకన్న

హన్మకొండ: ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెడుతోందని.. ఇప్పటికే యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ఏక్షణమైనా సమ్మెకు వెళ్లొచ్చని.. కార్మికులంతా సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ జయశ్రీ, కన్వీనర్ ఎం.శ్రీనివాస్, వైస్ చైర్మన్ సీహెచ్.యాకస్వామి, నాయకులు జి.ఎస్.పాణి, బి.జనార్దన్, ఎ.మురళి, టి.శ్రీనివాస్, జి.అశోక్, ఎ.యాదగిరి, ఆర్.మొగిలి, మంద శ్రీనివాస్, ఎం.రవీందర్, పసునూరి రవీందర్, వెంకటేశ్వర్లు, సునీత, సంపత్, పద్మ, రజిత, సవిత, మంజుల, ఎం.శ్రీను పాల్గొన్నారు.